క్లుప్తంగా

మలేరియా కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

గాజువాక: జీవీఎంసీలో పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని సీజనల్ మలేరియా కార్మికులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. సీజనల్ మలేరియా కార్మికులకు అనేక సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

నైపుణ్యానికి సాంకేతిక సహకారం అవసరం




ఐసీటీ టెక్నికల్ ట్రైనర్ ఆనంద్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: వృత్తిపరమైన, బోధన పద్ధతుల్లో నైపుణ్యం సాధించడానికి ఆధునిక సాంకేతిక సహకారం అవసరమని ఐసీటీ టెక్నికల్ ట్రైనర్ జి.ఆనంద్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సేల్స్‌ఫోర్స్ ప్లాట్‌ఫాం డెవలపర్ అంశంపై అధ్యాపకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశోధనలు, బోధనా నైపుణ్యాలతోపాటు విద్యార్థులకు కావాల్సిన సమాచారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్ సుందర్ రామన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2 విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్న వియ్యపు అప్పారావు (47) గత నెల 27న సైకిల్‌పై నైట్ షిఫ్ట్ విధులకు బయల్దేరాడు. బీసీ రోడ్డులోని మొదటి బ్రిడ్జి వద్ద అతను కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర జిల్లాల కబడ్డీ పోటీల విజేతలకు అభినందన




ట్రోఫీ స్వీకరిస్తున్న జిల్లా మహిళా కబడ్డీ జట్టు

గాజువాక: ఈనెల 3, 4, 5 తేదీల్లో కర్నూలులో నిర్వహించిన ఎం.రంగారావు మెమోరియల్ 50వ అంతర జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీల్లో విశాఖ జట్లు ప్రతిభ చూపాయి. బాల బాలికల విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించి చాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నాయి. కబడ్డీ ఫైనల్స్‌లో విశాఖకు చెందిన బాలికల జట్టు కర్నూలు జట్టుపై పది పాయింట్ల తేడాతో ప్రథమ స్థానాన్ని, బాలుర విభాగంలో విశాఖ జట్టు కర్నూలు జట్టుపై 12 పాయింట్ల తేడాతో మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంది. చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్న విశాఖ కబడ్డీ జట్లను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పద్మజాబాల, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన సీఈవో వి.వీరలంకయ్య, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.


పాతగంగవరం.. అనగానే గుర్తుకొచ్చేది సువిశాలమైన సముద్ర తీరం. నయానందరకరమైన చిత్రాలు కళ్ల ముందు కదలాడతాయి. మనోహర దృశ్యాలు అబ్బురపరుస్తాయి. అందుకే చలన చిత్ర పరిశ్రమకు చెందిన దర్శకులు, కథానాయకులు ఇక్కడ షూటింగ్‌కు మక్కువ చూపించారు. పాత గంగవరం తీరంలో తీసినా సినిమాలన్నీ **హిట్ అయ్యాయి. అయితే పోర్టురాకతో షూటింగ్‌ల సందడి తగ్గినా పర్యాటకులు మాత్రం ఇక్కడి అందాలను ఆస్వాదిస్తున్నారు.**

వెండితెర మణిహారం

పాతగంగవరం



సుందర సముద్ర తీరం



- ఇక్కడ తీసిన సినిమాలన్నీ సూపర్‌హిట్లే
- పోర్టురాకతో షూటింగ్‌లకు బ్రేక్
- పర్యాటకులకే పరిమితమైన పాతగంగవరం తీరం

అప్పట్లో మత్స్యకారులు వేటకు ఉపయోగించిన బోట్లు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలో పాతగంగవరం ప్రాంతం ఉంది. గంగవరం పోర్టు, విశాఖ ఉక్కు కర్మాగారానికి మధ్యలో రోడ్డుకు ఆనుకొని సన్నని పాయ లాంటి ఈ ప్రదేశంలో ఎన్నో సినిమాలను చిత్రీకరించారు. అవన్నీ సూపర్ హిట్లుగా నిలవడంతో దర్శకులకు ఈ ప్రాంతం సెంటిమెంట్‌గా మారిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. దీంతో ఈ ప్రాంతం వెండితెర మణిహారంగా విరాజిల్లింది.



మాధవస్వామి ఆలయం

గంగవరం పోర్టు రాక ముందు

గంగవరం పోర్టు రాక ముందు ఈ ప్రాంతం నిత్యం కళకళలాడుతూ ఉండేది. ఇక్కడ మత్స్యకారులు పిల్లాపాపలతో సంతోషంగా ఉండేవారు. గంగమ్మ తల్లిని నమ్ముకుని చేపల వేట సాగిస్తూ ఆనందంగా గడిపేవారు. అక్కడ గ్రామ దేవతలను ఆరాధించేవారు. గంగవరం పోర్టు వచ్చిన తర్వాత ఆ గ్రామాన్ని ఖాళీ చేయించారు. ఇప్పుడు అక్కడ పెద్దగా జనసంచారం లేకుండా నిశ్శబ్దంగా మారింది. ఏటా కనుమ రోజున అక్కడ పండగ చేసుకుంటూ ఉంటారు. నాటి స్మృతులను నెమరు వేసుకుంటారు. అప్పట్లో వారు ఆరాధించిన గ్రామ దేవతలను దర్శించుకుంటారు.



గంగవరం పోర్టు

కొండలు.. అలలు చెక్కిన శిల్పాలు

పాతగంగవరం తీరం వెంబడి ఉన్న కొండలు ఆకర్షణీయంగా దర్శనమిస్తాయి. ఈ కొండలను ఆనుకొని ఉన్న రాళ్లు అలలు చెక్కిన శిల్పాల్లా కనిపిస్తాయి. రాళ్ల మధ్య ఉన్న గుహలను చూస్తే ఊహలు గుసగుసలాడతాయి. తీరం ఒడ్డున ఉన్న ఈ రాళ్లపై కూర్చుంటే సమయమే తెలియదు. ఒక పక్క నుంచి సముద్ర కెరటాల హోరు.. మరో పక్క చల్లని గాలి సుతారంగా తాకుతుంటే.. ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేం.. ఇక్కడి మాధవస్వామి ఆలయం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆ ఆలయానికి వెళ్లే మెట్ల మార్గం మనకు ఎన్నో సినిమాల్లో కనిపించింది. సాగర తీరంలోని ఇసుక తిన్నెలు రా రమ్మంటూ ఆహ్వానిస్తాయి. ఇక్కడ ఉన్న గెస్ట్‌హౌస్ అద్భుతంగా ఉండేది. సినిమా షూటింగ్‌ల కోసం వచ్చిన వారు అక్కడే గడిపేవారు.

అగ్ర నటుల సినిమాలకు వేదిక

కృష్ణ, కృష్ణంరాజు కలిసి నటించిన అడవి సింహాలు చిత్రాన్ని ఇక్కడ చిత్రీకరించారు. ఆ సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. కమలహాసన్ నటించిన మరో చరిత్ర చిత్రం చరిత్రలో నిలిచిపోయింది. తర్వాత కాలంలో విశ్వనాథ్ దర్శకత్వంలో శుభసంకల్పం, చిరంజీవి నటించిన ఆరాధన, అభిలాష, కోకిలమ్మ, బాలకృష్ణ నటించిన లారీడ్రైవర్, సీమ సింహం, సమరసింహారెడ్డి, నాగార్జునతో రావోయి చందమామ, శివమణి, శ్రీకాంత్‌తో గిల్లికజ్జాలు, పండగ, ప్రేయసిరావే, నిన్నే ప్రేమిస్తా, వెంకటేష్ తొలి చిత్రం కలియుగ పాండవులు, సాహసవీరుడు, సాగరకన్య, పవన్ కల్యాన్‌తో సుస్వాగతం, జూనియర్ ఎన్టీఆర్‌తో బాలరామాయణం, స్టూడెంట్ నెంబర్ 1, ఆంధ్రావాలా, అల్లు అర్జున్‌తో ఆర్య, దేశముదురు, హరీష్‌తో ప్రేమఖైదీ, జేడీ చక్రవర్తితో గులాబి, ప్రేమకు వేళాయెరా, వేణుతో చెప్పవే చిరుగాలి చిత్రాలను ఇక్కడ చిత్రీకరించారు.



గెస్ట్ హౌస్

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం



దాత వెంకన్నబాబుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక నివాసి జి.వెంకన్నబాబు రూ.లక్ష విరాళమిచ్చారు. సంబంధిత నగదును సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో అందించారు. దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బాండ్ ఇచ్చారు. దేవస్థానం తరఫున అధికారులు దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రం అందించారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహం పాల్గొన్నారు.

రైల్వే గేటును ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం



వంగిపోయిన రైల్వే గేటు

అక్కిరెడ్డిపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఆటోనగర్‌లోని వడ్లపూడి రైల్వే క్యాబిన్ వద్ద రైల్వే గేటు ధ్వంసమైంది. దీంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం వేసి ఉన్న గేటును ఢీ కొట్టడంతో పూర్తిగా వంగి పోయింది. దీంతో ఆటోనగర్ నుంచి వడ్లపూడి, గ్రీన్ సిటీ తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహన చోదకులు, వడ్లపూడి, గ్రీన్ సిటీ వైపు వెళ్లే వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో వీరు వెనక్కి తిరిగి ప్రత్యామ్నాయ మార్గాల నుంచి తరలివెళ్లారు. గేటు మరమ్మతులకు ఎంత సమయం పడుతుందో రైల్వే సిబ్బంది వెల్లడించ లేదు.

మాదక ద్రవ్యాలతో మనిషి పతనం

సీఐ మల్లేశ్వరరావు

అగనంపూడి: మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు మానవ మృగాలుగా మారిపోతున్నారని.. విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు అన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం సత్ప్రవర్తన – ఉజ్వల భవిష్యత్ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత గంజాయి మత్తులో జోగుతుందని, ఆ మత్తులో ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. మత్తుకు అలవాటు పడిన వారు పతనమై కుటుంబానికి శోకం మిగుల్చుతున్నారన్నారు. బ్రహ్మకుమారీస్ జిల్లా కోఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి అక్కయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమైందని, ఈ దశలో మనసును ఆధీనంలో ఉంచుకుంటే తర్వాత జీవితం ఉజ్వలంగా ఉంటుందన్నారు. క్షణం ఆనందం, సుఖం కోసం చెడు వ్యసనాలకు బానిసలుగా మారొద్దన్నారు. మనసు, బుద్ధి మన ఆధీనంలో ఉండాలంటే విధిగా రోజూ యోగా, మెడిటేషన్ చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధీర్‌బాబు తదితరులు సీఐ మల్లేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో రాజయోగి బీకే చంద్రశేఖర్ బాయిజీ, అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, లెక్చరర్లు ఎం.శ్రీదేవి, పి.వి.రత్నం, శివకుమార్ పాల్గొన్నారు.



సీఐను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య

వాటర్ బాటిళ్లు, విద్యా సామగ్రి అందజేత

అగనంపూడి: విద్యార్థులు క్రమశిక్షణతో చదుకొని సన్మార్గంలో నడవాలని స్టీల్‌ప్లాంట్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. పిళ్లా వరహా వెంకటలక్ష్మి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వాసితకాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పెన్సిల్‌బాక్సులు, పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ అలవర్చుకుంటే చదువు, సంస్కారం అన్నీ అలవడతాయన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న నీరుకొండ రామచంద్రరావు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావులను ఘనంగా సత్కరించారు. వరలక్ష్మి సేవా ట్రస్ట్ చైర్మన్ పిళ్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పట్టా రామ అప్పారావు, ఎం.మస్తాన్‌రెడ్డి, బొండా ఈశ్వరరావు, కిడిమి హనుమంతురావు, ఐఆర్‌సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



దాతలను సత్కరిస్తున్న దృశ్యం

సేవామూర్తి

- అన్నార్తులకు అభయం
- ఆపదలో ఉన్న వారికి అండ
- విస్తృతంగా సేవాకార్యక్రమాలు చేస్తున్న శంకర్‌సాయిరాం



సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సాయిరాం

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటాడు.. బాధల్లో ఉన్న వారికి భరోసా ఇస్తాడు.. అన్నార్తులకు అభయ హస్తం అందిస్తాడు.. పేదల సేవే పరమావధిగా భావిస్తాడు.. గళ్లా శంకర్‌సాయిరాం.. సమాజ సేవే అతని లక్ష్యం.

విశాఖ ఉక్కులో ఉద్యోగం చేస్తూ వెంపళ్లనగర్ అధ్యక్షుడిగా.. సత్యసాయి భజనమండలి కన్వీనర్‌గా, స్టీల్‌ప్లాంట్ డీవీఆర్ యూనియన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు గళ్లా శంకర్ సాయిరాం. పుట్టపర్తి సత్యసాయిబాబా భక్తుడైన సాయిరాం సత్యసాయి సూక్తులను పాటిస్తాడు. 2005 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.

ఆధ్యాత్మిక చింతన.. సేవలు

16 సంవత్సరాలుగా సమాజసేవలో ఉన్న ఆయన ఆధ్యాత్మిక కార్యక్రమాలనూ నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన రేకిస్తున్నారు. వేకువ జామున నగర సంకీర్తన పేరుతో మండలంలోని అన్ని ప్రాంతాల్లో సత్యసాయి కీర్తనలతో ప్రజలను మేల్కొలుపుతారు. వెంపళ్లనగర్ అధ్యక్షుడిగా తనదైన శైలిలో అభివృద్ధి చేసి అందరిచే శెభాష్ అనిపించుకున్నాడు. దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ, పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి ఆయా కుటుంబాలకు అండగా నిలిచాడు. పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లాక్‌డౌన్ సమయంలో పేదలకు నిత్యావసర వస్తువులు అందజేశాడు. ఫ్రంట్‌లైన్ వారియర్స్ అయిన పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులకు శానిటైజర్లు, మాస్కులు అందజేసి తనలో సేవా గుణాన్ని చాటుకున్నాడు. అంతేకాకుండా ఏటా భగవాన్ పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా జయంతి రోజున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమంది ఆదర్శంగా నిలుస్తున్నాడు.



పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న శంకర్‌సాయిరాం

ఉక్కు పరిరక్షణ కోసం.. హోరెత్తిన బైక్ ర్యాలీ



కూర్మన్నపాలెం కూడలి వద్ద బైఠాయించిన కార్మికులు



చలో కలెక్టరేట్ బైక్ ర్యాలీలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

చలో కలెక్టరేట్‌కు తరలిన ఉక్కు ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సోమవారం నిర్వహించిన చలో కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున కార్మికులు తరలి వెళ్లారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పూర్తి వేతనాలు చెల్లించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్లతో ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌లో ప్రస్తుతం పూర్తి ఉత్పత్తి ఉన్నప్పటికీ యాజమాన్యం ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. నాలుగు నెలల్లో 285 శాతం జీతం యాజమాన్యం పెండింగ్‌లో పెట్టడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలుగు ప్రజలకు జీవనాడి అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ నిర్వహణకు అవసరమయ్యే ఇనుప గనులు కేటాయిస్తామని 8వ తేదీన విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

ట్యాక్స్ హాలీడే ప్రకటించాలి

సంస్థ మనుగడ కోసం క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ చేయాలని, మూడేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ పీఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీ, ఎస్‌ఎబీఎఫ్, ఫ్యామిలీ బెనిఫిట్‌లు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.గంగారావు, నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.టి. దాస్, బొడ్డు పైడిరాజు, డి.వి రమణారెడ్డి, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మందిరంలో హుండీ చోరీ



తాళాలు పగలగొట్టి కానుకలు కాజేసిన హుండీ

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిబ్బపాలెం నిర్వాసితకాలనీలోని రాధాకృష్ణ మందిరంలో హుండీలో చోరీ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ యలమంచిలి అప్పారావు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఆలయం తాళాలు వేసి ఇంటికి వెళ్లానని, ఉదయం ఆలయ అర్చకులు వచ్చి చూసే సరికి ఆలయ తలుపులు తెరిచి ఉండడంతోపాటు హుండీ మాయమైందని అర్చకులు తనతో చెప్పారని ఫిర్యాదులో అప్పారావు పేర్కొన్నారు. ఆలయ వెనుక భాగంలోని వరిగడ్డి కుప్ప వద్ద ఖాళీ హుండీ ఉందని, భక్తులు సమర్పించిన కానుకలు సుమారు రూ.30వేల వరకు తస్కరించుకుపోయారని ఆయన పేర్కొన్నారు.

ఒకే స్థలాన్ని ఇద్దరికి అమ్మిన కేసులో జైలు

అక్కిరెడ్డిపాలెం: ఒకే స్థలాన్ని ఇద్దరి అమ్మిన కేసులో ఇరువురికి జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ గాజువాక అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పింది.

గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలు... మింది గ్రామానికి చెందిన మంగా విజయలక్ష్మికి 2006 సంవత్సరంలో సర్వే నంబర్ 2/16లో 35 సెంట్ల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన ఈటి రంగారావు, రెడ్డిపల్లి సత్యనారాయణలు విక్రయించారు. అదే స్థలాన్ని 2005 సంవత్సరంలో వీరిరువురు బీచ్ మినరల్ కంపెనీకి అమ్మి రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన మంగా విజయలక్ష్మి 2013 సంవత్సరంలో వీరిపై ఫిర్యాదు చేశారు. విచారణలో ఒకే స్థలానికి ఇద్దరికి అమ్మినట్టు తేలింది. దీంతో కోర్టు రంగారావు, రెడ్డిపల్లి సత్యనారాయణకు మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధించిందన్నారు.

ఐఎన్‌టీయూసీ పాకెట్ డైరీ ఆవిష్కరణ

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టీయూసీ) 2025 నూతన సంవత్సర పాకెట్ డైరీని షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాకెట్ డైరీ తో పాటు ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం బహుమతిని సీఎండీ ఖత్రి ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

అటెన్షన్ ప్లీజ్

వాలిన విద్యుత్ స్తంభం



ఆటోనగర్ ఏ - బ్లాక్ నుంచి రాంనగర్ భెల్ సిగ్నల్ పాయింట్ వైపు వచ్చే మార్గంలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఏక్షణాన కూలుతుందో తెలియని స్థితిలో ఉంది. దీంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి స్తంభం సరిచేయడమో లేదా తొలగించాలని కోరుతున్నారు.

- అక్కిరెడ్డిపాలెం